RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 210 | జులై 17, 2025 | వెల : రూ.3-00



పారదర్శకంగా ప్రజలకు న్యాయం చేయాలి

2లో..

# ఒక్క క్లిక్.. డబ్బులు ధమాల్

- మనీ ఆశ చూపి సోషల్ మీడియాలో మోసాలు
- లింకులు ఓపెన్ చేస్తే .. క్యాష్ ఖల్లాస్
- జాగ్రత్తలు పాటించకుంటే అంతే సంగతులు



**వేద న్యూస్, ఫోకస్ టీమ్ :**

ఇంటర్నెట్ విస్తృతంగా అందుబాటులోకి వచ్చి ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ మామూలు విషయమైన ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. మొబైల్ ఫోనుకు లింకులు పంపుతూ.. బ్యాంకు అకౌంట్లను కొల్లగొడు తున్నారు. లోన్లు ఆఫర్లు, ఉద్యోగ అవకాశాలు లక్కీ డ్రా బ్యాంక్ కేవైసీ.. ఇలా ఏదో ఒకటి చెబుతూ అమాయకులను దోచేస్తున్నారు. వాట్సప్ ఫేస్బుక్ మధ్యమాలను వేదికగా చేసుకొని ఫోన్లను హ్యాక్ చేస్తున్నారు. బ్యాంకులో కార్పొరేట్ సంస్థల లోగోలతో మొబైల్ ఫోన్లో కు ఏపీకే ఫైళ్లు, లింకులు పంపుతా అందినకాడికి దోచుకుంటున్నారు. రైతులను పీఎం కిసాన్ సమ్మాన్, రైతు భరోసా పేరుతో మోసం చేస్తున్నారు. అక్షరాస్యులు, నిరక్షరాస్యులు అనే తేడా లేకుండా మోసపోతున్నారు. డిజిటల్ లావాదేవీలు గేమింగ్ యాప్ లో సైబర్ నేరగాళ్లకు వరంలా మారాయి. వరంగల్ జిల్లాలో సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకూ క్రమంగా పెరుగుతున్నది.

**- సైబర్ నేరాలపై పోలీసుల సూచన..**

సైబర్ నేరాలపై తెలంగాణ సైబర్ క్రైం పోలీసులు ప్రజలకు నిత్యం ఏదో ఒక రకంగా అవగాహన కల్పిస్తున్నారు. గుర్తు తెలియని లింకులు క్లిక్ చేయద్దు. వచ్చే లింకులు పూర్తిగా నిర్ధారణ చేసుకున్న తర్వాతే ఓపెన్ చేయాలి. డిజిటల్ చెల్లింపులు, బ్యాంక్ ఖాతాలలో నగదు తక్కువగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. గూగుల్ సెర్చ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. గుర్తు తెలియని ఫోన్ నెంబర్ల నుంచి గాని లేదా వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్లు, ఫోన్లు లిఫ్ట్ చేసి బ్యాంకు వివరాలు ఓటీపీ ఆధార్ పాన్ కార్డు వివరాలను చెప్పొద్దు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 లేదా cyber-crime.gov. in కు ఫిర్యాదు చేయాలి. సైబర్ మోసానికి గురైన గంటలోపు ఫిర్యాదు చేస్తే న్యాయం జరగడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. అలాగే రూ.7 లక్షల వరకు సైబర్ వలలో చిక్కుకుంటే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయవచ్చు. రూ.7 లక్షలకు పైగా మోసపోయి ఉంటే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

**- ఏపీకే లింక్ ఓపెన్ చేయగానే రూ.46 వేలు మాయం**

పెరుమాండ్ల అంజయ్య అనే వ్యక్తి ఈ నెల 13న సాయంత్రం తనకు పరిచయం ఉన్న వ్యక్తి నుంచి తమ సంఘం గ్రూపులో పీఎం కిసాన్ ఏపీకే లింక్ వచ్చింది.తమ సహచరులే పంపారనుకుని.. సదరు లింక్ను ఓపెన్ చేసి లింక్ అర్థం కాకపోవడంతో బ్యాక్ వచ్చి అలాగే ఉంచాడు. లింక్ ఓపెన్ కాగానే సైబర్ నేరగాళ్లు 14వ తేదీ రాత్రి 2 గంటల నుంచి 3.30 వరకు ఖాతాలో ఉన్న సొమ్ములోంచి రూ.46 వేలు దఫదఫాలుగా విత్డ్రా చేశారు. అంజయ్య ఉదయం లేచి తన వాట్సాప్ ఓపెన్ చేసే ప్రయత్నం చేయగా పోన్ పనిచేయడం నిలిచిపోయి ఫోన్ వేడెక్కిపోయింది.వెంటనే అర్థం కాక తన హెచ్డీఎఫ్సీ బ్యాంకు ఖాతా చెక్ చేసుకునే సరికి రూ.46 వేలు ఖాళీ కాగా సదరు బ్యాంకు స్టేట్మెంట్ ద్వారా 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు.

**- లింక్ క్లిక్ చేశాడు..రూ.42,600 మాయం**

వరంగల్ రామన్నపేటకు చెందిన వ్యాపారికి బ్యాంక్ ఏవైసీ అప్డేట్ చేయాలంటూ వచ్చిన మెసేజ్ క్లిక్ చేస్తే తన ఖాతా నుండి రూ.42,600 మాయమయ్యాయి. కిరాణా షాప్ లో ఖాతా డబ్బులు కట్టాలని బ్యాంకు అకౌంట్లో ఉంచుకున్న డబ్బులు మాయమయ్యేసరికి ఫిర్యాదు చేశాడు.



## పెట్రోల్ బంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

**వేద న్యూస్, వేములవాడ :**

మెప్మా ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ అర్బన్ మండలం పరిధిలోని మారుపాక వద్ద సర్వే నంబర్ 339 లో ఉన్న ఎకరం ప్రభుత్వ భూమిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలం హద్దులు సిద్ధం చేయాలని, మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు పెట్రోల్ బంక్ నిర్మాణ ఏర్పాటు కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి కింద మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ పర్యటనలో వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, డీటీసీపీఓఅన్సార్,పంచాయతీ రాజ్ ,ఇరిగేషన్ అధికారులు,డిపిఓ తదితరులు పాల్గొన్నారు.

## అగ్రరాజ్యంలో కరోనా కలకలం


- అమెరికాలో కరోనా కొత్త వేరియంట్లు

మిగతా 3వ పేజీలో..

## పత్రాలకు భద్రత కరువు..!

**తహసిల్దార్ కార్యాలయానికి ప్రహరీ నిర్మించేది ఎన్నడు..?**

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**




వేములపల్లి మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయానికి ప్రహరీ గోడ నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రక్షణ గోడ లేకపోవడంతో తహసిల్దార్ కార్యాలయానికి సంబంధించిన ముఖ్యమైన పత్రాలకు భద్రత కరువైంది. మండలంలోని పలు గ్రామాల ప్రజలు వివిధ సమస్యల కోసం తహసిల్దార్ కార్యాలయానికి రాకపోకలు కొనసాగిస్తున్నారు అయితే కార్యాలయంలో పశువులు, పందులు సరిస్రూపాల భయం ప్రజలకు వెంటాడుతుంది. అంతేకాకుండా ప్రహరీ గోడ లేకపోవడంతో రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డు పక్కన తహశీల్దార్ ఉండడం కార్యాలయానికి సెలవు దినం నా వాహనదారులు, ప్రజలు విశ్రాంతి కోసం రాకపోకలు కొనసాగిస్తుండడంతో ముఖ్యమైన పత్రాలకు భద్రతకు సంబంధించిన అధికారులు బిక్కుబిక్కుమంటున్నారు. తహసిల్దార్ కార్యాలయంలో సౌకర్యాలు మెండుగా ఉన్న చెత్త పేరుకుపోయి ఉండడంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. సమస్యలకు నిలయంగా ఉన్న వేములపల్లి తహసిల్దార్ కార్యాలయానికి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే,ఉన్నతాధికారులు దృష్టి సారించి తహసిల్దార్ కార్యాలయానికి ప్రహరీ గోడ తక్షణమే నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## మహిళా సాధికారతే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

**- మహిళా నాయకత్వ శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**వేద న్యూస్, హన్మకొండ :**




కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో మహిళలను రాజకీయంగా చైతన్య పరచి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ప్రత్యేకంగా "అధినేత్రి - ఆలోచన! అధ్యయనం! ఆచరణ!" మహిళా నాయకత్వ శిక్షణ శిబిరం హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ సెంటర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాతెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి,వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ,రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివ చరణ్ రెడ్డిలు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు రాజకీయ రంగంలోకి వస్తేనే సమాజం నిజమైన అభివృద్ధి సాధిస్తుందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, నాయకత్వం చూపే మహిళలకు మార్గదర్శిగా నిలుస్తుందని చెప్పారు.మహిళలు సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, ఆచరణలోకి తేవడం ద్వారా సమాజం మెరుగుపడుతుంది. అలాంటి నాయకులను తయారు చేయడం కోసం ఈ శిక్షణ శిబిరం అని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పసునూరి దయాకర్ ,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ వి శ్రీనివాస్ రావు,జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ,యువజన మహిళా కాంగ్రెస్ నాయకురాలు సాగరిక,శ్వేత,మహిళా కాంగ్రెస్ నేతలు, మహిళా మాజీ ప్రజా ప్రతినిధులు, యువజన విభాగ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం..!

**వేద న్యూస్, గంగాధర :**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న బిల్లుల కారణంగా అప్పుల బాధ తాళలేక మాజీ సర్పంచ్ తాళ్ల విజయలక్ష్మి భర్త రవి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.లక్ష్మీదేవిపల్లి మాజీ సర్పంచ్ తాళ్ల విజయలక్ష్మి గ్రామ అభివృద్ధి పనుల కోసం తన సొంత భూమిని, బంగారాన్ని తాకట్టు పెట్టి దాదాపు రూ. 11 లక్షలు వెచ్చించారు. ఈ బిల్లుల మంజూరు కోసం ఆమె ప్రభుత్వానికి పలుమార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, అధికారులు పట్టించుకోలేదని ఆరోపణలు వస్తున్నాయి. బిల్లులు రాకపోవడంతో, అప్పులు ఇచ్చిన వారి నుండి ఒత్తిడి పెరిగింది. పెరిగిన వడ్డీలు, రుణదాతల వేధింపులతో మనస్తాపానికి గురైన విజయలక్ష్మి కుటుంబం తీవ్ర ఆవేదనలో ఉంది. ఈ పరిస్థితిని తట్టుకోలేక విజయలక్ష్మి భర్త రవి గడ్డి మందు గుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే ఆయనను కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రవి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు.



## అస్సలు క్షమించవద్దు

**- కేరళ నర్సు చేతిలో హత్యకు గురైన యెమెన్ వ్యక్తి సోదరుడు**

**వేద న్యూస్, డెస్క్:**



2017లో కేరళ నర్సు నిమిష ప్రియ చేతిలో హత్యకు గురైన యజమాని తలాల్ అబ్దో మెహదీ సోదరుడు అబ్దేల్‌ఫట్టా మెహదీ, ఈ నేరానికి క్షమాపణ ఉండదని నొక్కి చెప్పారు. నిమిష ప్రియను ఉరితీయాలని ఆయన అన్నారు. దోషిగా తేలిన నిమిషను భారతీయ మీడియా బాధితురాలిగా చిత్రీకరించడం పట్ల తన కుటుంబం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు

మిగతా 3వ పేజీలో..

# విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

**వేద న్యూస్, బోయినపల్లి :**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపపల్లి మండలం బూరుగుపల్లి గ్రామం లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలను ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని ,విద్యార్థులకు ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్, ఆధ్వర్యం లో బహుమతుల ప్రదానం చేశారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి మెమెంటో, నోట్ బుక్ ,పెన్ ,ద్వితీయ, తృతీయ బహుమతి గెలుపొందిన వారికి కూడా మెమెంటో,నోట్ బుక్ ,పెన్ అందజేశారు.పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ యొక్క ప్రాముఖ్యతను వారు భారత దేశ స్వాతంత్ర ఉద్యమం లో దేశం కోసం ఏ విధంగా పనిచేశారు తెలియజేయడం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు నేతాజీ ,అంబేద్కర్ ,స్వామి వివేకానంద, లాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో గాను కృషి చేశారని స్వాతంత్రం తీసుకురావడం లో ఆయన పాత్ర దేశ ప్రజలు మరువలేరనిదని అని అన్నారు. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని తరిమికొట్టిన మహోన్నత పోరాట ధీరుడు నేతాజీ అని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆత్మీయ స్వచ్ఛంద ప్రధాన కార్యదర్శి బోయిని వేణు యాదవ్,ఉపాధ్యక్షులు ఎడపల్లి వంశీ,నాయకులు గణేష్,అనిల్,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో డిఈఓ పర్యటన

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోదురుపాక గ్రామంలోని జడ్పీఎచ్ఎస్, ఏంపిపిఎస్ రెండు స్కూల్ లను డిఈఓ, వినోద్ కుమార్ సందర్శించారు. అనంతరం విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. బోయినిపల్లి మండలం కోదురుపాక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్ ఉందా లేదా అని అడిగి తెలుసుకొని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ఆహార నాణ్యతను పరిశీలించడం జరిగింది.అలాగే (ఎఫ్ఎల్ఎన్) యొక్క జాతీయ లక్ష్యం పిల్లలందరూ గ్రహణ శక్తితో చదవడం మరియు ప్రతిస్పందించడం అవగాహనతో స్వతంత్రంగా వ్రాయడం సంఖ్యాభావం గణిత ఆలోచన సమస్య పరిష్కారం తార్కికతను అభివృద్ధి చేయడం కు తోడ్పడాలని తెలియజేయండం జరిగింది. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. బహుళ అంశాలపై సూచనలు ఇచ్చి, పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్,జడ్పీఎచ్ ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రెండు పాఠశాలల, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**వేద న్యూస్,సిద్దిపేట :**



సిద్దిపేట పట్టణం చెందిన తోట్ల కనకయ్య కి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం చెక్కును అందించడం జరిగింది. నాడు బాధితుడు అనారోగ్యంతో హాస్పిటల్ లో ఖర్చుల పాలు కాగా, అతనికి మేమున్నామని ధైర్యం చెప్పి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అతని జరిగిన ఆర్థిక భారాన్ని తగ్గిస్తానని సిద్దిపేట స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు న్యాయవాది బైరి ప్రవీణ్ కుమార్ వారి కుటుంబానికి ధైర్యం నింపి అతని చెప్పిన విధంగానే బాధితుని ఆర్థిక దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం చేయించి దానికి సంబంధించిన చెక్కును బాధితుని కుటుంబానికి అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా చెక్కు అందుకున్న కనకయ్య కుటుంబీకులు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రావడం వల్లనే సామాన్య ప్రజలకు న్యాయం జరుగుతుందని, ఈ విధంగా ప్రభుత్వం నుంచి సామాన్యులమైన తమకు ఆర్థిక సహాయం లభిస్తుందని అసలు ఎన్నడూ ఊహించలేదని అన్నారు. కానీ అలాంటి మా ఊహకు అందని విషయాన్ని నిజం చేయడంలో మా వెన్నంటే నడిచి సహాయం చేసిన కాంగ్రెస్ నాయకులు న్యాయవాది బైరి ప్రవీణ్ కుమార్ కు తమ కుటుంబం ఎంతో రుణపడి ఉందని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 17వ వార్డు ఇంచార్జ మరియు వెంకటేశ్వర దేవస్థానం డైరెక్టర్ బైరి నాగమణి ,38వ వార్డు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుండబైన రాజు తదితర పట్టణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా బోనాల పండుగ

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని ఆనంద్ విద్యానికేతన్ హై స్కూల్ లో ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. బుధవారం స్కూల్ టీచర్లు విద్యార్థులు బోనాలు తీసుకొని పోచమ్మ దేవాలయంకు వెళ్లి మొక్కలు చెల్లిచుకున్నారు. పిల్లలు పోతారాజు ల వేశాధారణ చేసుకొని నృత్యాలు చేస్తూ విద్యార్థులు డాన్స్ లు చేస్తూ గ్రామ ప్రజల ను ఆకట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆనంద్ విద్యానికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలంగాణలో బోనాల పండగ ఒక విశిష్టతను విద్యార్థులకు వివరించడం జరిగింది. అలాగే ఈ పండుగను ఆషాడ మాసంలో ప్రారంభించి శ్రావణమాసం చివరిదాకా జరుపుకోవడం జరుగుతుంది. వర్షాలు బాగా కురవాలని పాడి పంటలు బాగా అభివృద్ధి చెందాలని ప్రజలంతా ఎలాంటి అనారోగ్యాల బారిన పడకుండా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పోతరాజు విన్యాసాలు గ్రామ ప్రజలను అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, మరియు విద్యార్థిని విద్యార్థులు, పాల్గొన్నారు.

# చీటింగ్ కేసులో రెండు సంవత్సరాల జైలు శిక్ష

**వేద న్యూస్, శాయంపేట :**

చిట్టీలు కట్టించుకుని మోసం చేసిన వ్యక్తికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించిన కోర్టు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శాయంపేట మండలంలోని అప్పయ్యపల్లి గ్రామానికి చెందిన డోలే రామారావు అను అతను శాయంపేట మండలంలోని వివిధ గ్రామాల ప్రజలను చిట్టీలు వేస్తున్నానని నమ్మించి మోసం చేయగా బాధితులు అప్పటి శాయంపేట ఎస్సై ఇ. వీరభద్ర రావు 2022 సంవత్సరంలో డోలే రామారావుపై చీటింగ్ కేసు నమోదు చేసి విచారణ జరిపి ఛార్జ్ షీట్ ఫైల్ చేసినారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్ట్ హన్మకొండ మేజిస్ట్రేట్ కే. పట్టాభి రామారావు సాక్షాలను విచారించిన అనంతరం సదరు ముద్దాయి అయిన డోలే రామారావు కి రెండు సంవత్సరాల కఠిన కారాగారా శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారని తెలిపారు.ఇట్టి కేసులో సాక్షులను విచారించడంలో సహకరించిన పిపిసి. రాము జేడిని , బాధితులకు న్యాయం జరిగేలా ఇన్వెస్టిగేషన్ చేసిన ఎస్సై ఇ. వీరభద్రరావు నీ సాక్షులను సక్రమంగా కోర్టులో ప్రవేశపెట్టి నిందితులకి శిక్ష పడేలా చేసిన కె. పరమేశ్వరి వాసి, కోర్టు విధులను సక్రమంగా నిర్వర్తించిన ఆర్. సికెందర్, దామెర పియస్ కోర్ట్ కానిస్టేబుల్ లను పరకాల ఏసీపీ సతీష్ బాబు , సిఐ. రంజిత్ రావు, శాయంపేట ఎస్సై పరమేశ్వర్, దామెర ఎస్సై కొంక అశోక్ వారిని అభినందించారు.

# రవిని పరామర్శించిన ఎమ్మెల్యే

**వేద న్యూస్, చొప్పదండి/ గంగాధర :**



గంగాధర మండలం లక్ష్మీదేవి పల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ తాళ్ళ విజయలక్ష్మి భర్త రవి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో గ్రామభివృద్ధి కోసం అప్పులు తెచ్చి పనులు చేయించారు. ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వారికి సకాలం లో బిల్లులు చెల్లించక పోవడం వల్ల అప్పులు తెచ్చి పనులు చేసిన సర్పంచులు ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యం లో చేసిన పనులకు ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా మోసం చేసిందని ఆర్థిక ఇబ్బందులు భరించలేక తీవ్ర మనస్థాపం చెంది నిన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆసుపత్రిలో చకిత్స పొందుతున్న ఆయనను పరామర్శించి చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చు స్వయంగా బరిస్తానని వారి కుటుంబ సభ్యులకు చెప్పి దైర్యం నింపారు. వారికి ఏ సమస్య వచ్చిన తనను కుటుంబ సభ్యుడిగా బావించి చెప్పాలని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సర్పంచులకు చెల్లించే బిల్లుల విషయంలో ఆనాటి బీఆర్ఎస్ పార్టీ అనుసరించిన నీచమైన విధానాల వల్లే నేడు సర్పంచులు అప్పుల ఊబిలో చిక్కుకు పోయారు. బిల్లులు చెల్లిస్తాం. పనులు చేయండి అని ఆనాటి కేసీఆర్ ప్రభుత్వం సర్పంచులను ఆర్థికంగా వాడుకుని వారికి బిల్లులు ఇవ్వకుండా మోసం చేసిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని తీవ్రంగా విమర్శలు చేశారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

**వేద న్యూస్, ఇల్లంతకుంట :**



ఇల్లంతకుంట మండలం తిప్పాపురం, గాలిపల్లి, జవారిపేట గ్రామల నుండి 120 మంది భారీ బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ లోకి చేరారు. తిప్పాపురం గాలిపల్లి, జవారిపేట గ్రామాలకు చెందిన తాజా మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్ లతో పాటు పెద్ద ఎత్తున నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి పార్టీలోకి మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆహ్వానించారు. తిప్పాపురం తాజా మాజీ సర్పంచ్ దమ్మని లక్ష్మి, లక్ష్మణ్, మాజీ సర్పంచ్ లు బొల్లవేని మంజుల -రమేష్, ఉప సర్పంచ్, కోడిముంజ తిరుపతి లు గాలిపెల్లి మాజీ సర్పంచ్ అరకూటి విజయలక్ష్మి -మల్లేశం, న్యాత పోశయ్య, జవారిపేట మాజీ సర్పంచ్ పల్లె శ్రీలత రాజశేఖర్ ,ఇతర ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరడం జరిగింది.ఈ కార్యక్రమంలోమండల అధ్యక్షులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు ఉట్కూరి రమణారెడ్డి, గుడిసె ఐలయ్య, రాష్ట్ర కిసాన్ సెల్ కార్యదర్శి పాశం రాజేందర్ రెడ్డి, మాజీ ప్యాక్స్ చైర్మన్ ఐ రెడ్డి మహేందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడిసంజీవ్ ,మానకొండూర్ నియోజకవర్గం అధికార ప్రతినిధి పసుల వెంకటి ,సీనియర్ నాయకులు చిట్టి ఆనంద రెడ్డి బెజ్జంకి తిరుపతి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ప్రజలకు న్యాయం చేయాలి

**వేద న్యూస్, కాజీపేట :**



పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు పోలీస్ అధికారులు పారదర్శకంగా న్యాయం చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ కాజీపేట పోలీస్ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం కాజీపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. తనిఖీలకై పోలీస్ స్టేషన్ చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు స్టేషన్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్‌రెడ్డి పూలమొక్కను అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీసులు సీపీకి గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ పోలీస్ సిబ్బంది నిర్వహించిన పరేడ్ తో పాటు కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా సీపీ పోలీస్ స్టేషన్ రిసెప్షన్, సిసిటిఎన్ఎస్ విభాగాల పనీతీరును సంబంధిత పోలీస్ సిబ్బందిని సిపి అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులకు సంబంధించి పోలీస్ కమిషనర్ క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అలాగే స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు, అనుమానితులు, కేడీ, డిసిలు, మిస్సింగ్, ఆస్తి నేరాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ సిబ్బందిని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని కలిగించడంతో పాటు, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలంటే ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలి. ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతోపాటు, మర్యాదపూర్వకంగా వారి ఫిర్యాదులు ఆలకించాల్సిన బాధ్యత అందరిపై ఉంది అని సీపీ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా,కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, కాజీపేట ఎస్.ఐలు నవీన్‌కుమార్, లవణ్‌కుమార్, శివ, తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ట్రంప్ ఏకపక్ష వాణిజ్య విధానం

అమెరికాతో భారత్ కుదుర్చుకోవలసిన వాణిజ్య ఒప్పందంలో ట్రంప్ విధించిన గడువు జూలై తొమ్మిదితో ముగిసింది. ఈ విషయంలో ఉభయ దేశాల మధ్య చర్చలు జరుగుతుండగానే ట్రంప్ ఏకపక్షంగా భారత్‌లో వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు. దీనిపై ప్రధాని మోడీ స్పందించలేదు. ఈ ఒప్పందం ప్రకారమైతే అమెరికా కోసం భారత్ మార్కెట్‌ను తెరవాలి. తన వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకోవడానికి అవకాశం కల్పించాలి. మన మార్కెట్‌లోకి అమెరికా ఉత్పత్తులైన డెయిరీ, పౌల్ట్రీ, మొక్కజొన్న, సోయాబీన్, బియ్యం, గోధుమలు, ఇథనాల్, సిట్రస్ పండ్లు, బాదం, యాపిల్,ద్రాక్ష, క్యానడ్ పీచస్,చాక్‌లెట్స్ ఇవి దిగుమతి అయితే దేశ వ్యవ సాయ రంగానికి తీవ్రనష్టం. ఎందు కంటే, భారత జనాభా 146కోట్ల మందికి సరిపడా ఆహార ధాన్యాలు ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని అమెరికా నుండి దిగుమతి చేసుకుంటే వ్యవసాయ రంగంపై ఆధారపడిన సన్న,చిన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతారు. అమెరికాలో సబ్సిడీలెక్కువ. అందులో వ్యవసాయంపై ఆధారపడిన వారు కేవలం ఐదు శాతం మాత్రమే. అక్కడ యావరేజ్ కమతం 187 హెక్టార్లు. భారతదేశంలో ఒక హెక్టార్‌లోపు మాత్రమే వస్తుంది. కాబట్టి అమెరికాలో దిగుబడి బాగా ఉంటుంది. భారత మార్కెట్ లో వ్యవసాయం, పాల ఉత్పత్తుల రంగంలో తమ ఉత్పత్తులను తెరవాలనేది అమెరికా డిమాండ్.ఈ ఉత్పత్తుల దిగుమతులపై విధిస్తున్న సుంకాలను తగ్గించమని భారత్‌పై ఒత్తిడి తెస్తోంది.అమెరికా ప్రధానంగా గోధుమ,బియ్యం,పాల ఉత్పత్తులు,సోయా,పిస్తా,బాదం వంటి ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను తగ్గించాలని కోరుతోంది. అమెరికన్ కంపెనీలు అమెజాన్,వాల్‌మార్ట్ వంటి సంస్థలు నేరుగా భారత మార్కెట్‌లోకి ప్రవేశించి తమ ఉత్పత్తులను సులభంగా విక్రయించేందుకు ఇది సహాయపడుతుంది.అయితే ఈ ఉత్పత్తులు చౌకధరలకు అందిస్తే భారతదేశ రైతులు తీవ్రనష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆహార భద్రత కింద వ్యవసాయ ఉత్పత్తుల ధరలను కూడా కేంద్ర ప్రభుత్వం నియంత్రణలో ఉంచుతుంది. దీంతో మన రైతులకు గిట్టుబాటు ధరలు కూడా రావడం లేదు.జన్యుపరమైన మార్పులతో అమెరికా పండించిన ఆహార పంటలను ఉత్పత్తి చేస్తుంది.ప్రధానంగా మొక్కజొన్న, సోయాబీన్స్ వంటివి వీటితో పాటు పశువులకు అవసరమైన దానా సప్లరు చేయడానికి ఒప్పం దం చేసుకోవాలని చూస్తుంది. గతంలో మనదేశం డెయిరీ ఎగుమతులపై ఆంక్షలు విధించింది. ఇప్పుడు దాన్ని ఎత్తివేయాలని అమెరికా కోరుతున్నది. ఇండియా సాధారణంగా 17శాతం టారిఫ్ వేస్తున్నది.దీన్ని ఇప్పుడు టారిఫ్ కిందకు తీసుకురావాలని చెప్ప కుండా 3.3శాతం టారిఫ్ అమలు చేయాలంటోంది.అమెరికా మన ఎగుమతులపై 26శాతం టారిఫ్‌లు పెంచింది. తమ వాణిజ్యలోటును తగ్గించుకునేందుకు వ్యవసాయ ఉత్పత్తులను భారత్‌కు ఎగుమతి చేయాలనుకుంటోంది.దీంతో అమెరికా లోని రైతులకు లాభం చేకూరుతుంది. అమెరికా ఉత్పత్తులు మన దేశంలోకి వస్తే మన పంటలకు ధరలు లేక రైతుల ఆదాయాలు పడిపోతాయి. పైగా రైతులు అనివార్యంగా వ్యవసాయ రంగం నుంచి తప్పుకుని ఆహార పంటలను తగ్గించాల్సి వస్తుంది. అమెరికాలో మొక్క జొన్న, సోయాబీన్, గోధుమ, బియ్యం వంటి పంటలపై నూతన వ్యవసాయ బిల్లులతో 61డాలర్ల నుండి 175డాలర్లకు సబ్సిడీ పెంచారు.అంటే 150శాతం.పంట బీమా సబ్సిడీ,అగ్రికల్చర్ రిస్క్ కవరేజీ కూడా కనీస దిగుబడి కంటే తక్కువ వస్తే మాత్రమే అంత మొత్తం సబ్సిడీ ఇస్తారు.ధర కోల్పో యిన కవరేజ్ కూడా జాతీయ సగటు ధర కంటే మార్కెట్‌లో తక్కువ ధరకు సరుకు అమ్మితే ఆ మొత్తం సబ్సిడీ ఇస్తారు.పంట ఉత్పత్తి, పర్యావరణహిత పంటలకు మాత్రమే సబ్సిడీ ఇస్తారు.అమెరికాలో చిన్న రైతులకు కేవలం 39శాతం సబ్సిడీలిస్తే పెద్ద రైతులకు 69శాతం సబ్సిడీ ఇస్తున్నారు.ఈ సంఖ్య చాలా పెద్దగా ఉంటుంది. అమెరికాలో చిన్నరైతు అంటే 500 ఎకరాలలోపు ఉన్నవారే.అమెరికా బడ్జెట్‌లో 6.8ట్రిలియన్ డాలర్లు కేటాయించినది.ఒక ట్రిలియన్ అంటే రూ.వెయ్యి కోట్లు.అంటే 6లక్షల 80వేల కోట్ల డాలర్లు.అయితే భారతదేశం వ్యవసాయ రంగానికి కేవలం 2.5శాతం మాత్రమే సబ్సిడీ ఇస్తున్నది.ఈ రకంగా భారతీయ వస్తువులపై అమెరికా ప్రతీకార సుంకాలు విధించిన పక్షంలో వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, ఫార్మా,వైద్య పరికరాలు,విద్యుత్తు పరికరాలు,యంత్రాలతోసహా అనేక రంగాలకు చెందిన వస్తువులపై ప్రతి కూల ప్రభావం పడుతుంది. అమెరికా,భారత్ విధించే దిగుమతి సుంకాల రేట్ల మధ్య చాలా తేడా ఉన్న కారణంగా ట్రంప్ ప్రభుత్వం నుంచి అదనపు కస్టమ్స్ సుంకాలను ఈ రంగాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అమెరికా,భారత్ మధ్య రసాయనాలు,ఫార్మసీ వస్తువుల దిగు మతి సుంకంలో 8.6 శాతం తేడా ఉంది.ట్రంప్ విధించే ప్రతీకార సుంకాల కారణంగా అమెరికాకు దిగుమ తయ్యే భారతీయ వస్తు వులపై నికరంగా 310 కోట్ల డాలర్ల అంటే సుమారు 26,483 కోట్ల రూపాయలు నష్టం ఏర్పడగలదు. అమెరికాలో చిన్నరైతు అంటే 500 ఎకరాలలోపు ఉన్నవారే.అమెరికా బడ్జెట్‌లో 6.8ట్రిలియన్ డాలర్లు కేటాయించినది.ఒక ట్రిలియన్ అంటే రూ.వెయ్యి కోట్లు.అంటే 6లక్షల 80వేల కోట్ల డాలర్లు.అయితే భారతదేశం వ్యవసాయ రంగానికి కేవలం 2.5శాతం మాత్రమే సబ్సిడీ ఇస్తున్నది.ఈ రకంగా భారతీయ వస్తువులపై అమెరికా ప్రతీకార సుంకాలు విధించిన పక్షంలో వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, ఫార్మా,వైద్య పరికరాలు,విద్యుత్తు పరికరాలు,యంత్రాలతోసహా అనేక రంగాలకు చెందిన వస్తువులపై ప్రతి కూల ప్రభావం పడుతుంది. అమెరికా,భారత్ విధించే దిగుమతి సుంకాల రేట్ల మధ్య చాలా తేడా ఉన్న కారణంగా ట్రంప్ ప్రభుత్వం నుంచి అదనపు కస్టమ్స్ సుంకాలను ఈ రంగాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

# 18 గంటలు విద్యుత్తును సరఫరా చేయాలి

**వేద న్యూస్, గంభీరావుపేట :**




గంభీరావుపేట మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేయడం జరిగినది. ఈ ఆందోళన కార్యక్రమానికి పలువురు నాయకులు పాల్గొని ప్రభుత్వం ఇస్తామన్న నాణ్యమైన 18గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.రైతులు ఇప్పుడున్న పరిస్థితుల్లో వర్షాలు లేక అనేక ఇబ్బందులుపడుతున్న తరుణంలో సెస్ పాలకవర్గం నిర్లక్ష్యమో..అధికారుల నిర్లక్ష్యమో తెలియదు కానీ రైతుల నోట్లో మట్టి కొట్టేటువంటి పరిస్థితి ఏర్పడుతుందని మండిపడ్డారు. ఈ ధర్నా కార్యక్రమానికి సెస్ ఏఈ వచ్చి 18 గంటల నాణ్యమైనటువంటి విద్యుత్తును ఇస్తామని రైతులను హామీ ఇవ్వడంతో ధర్నా విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు గంట అశోక్, గడ్డమీద ప్రసాద్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లక్కిరెడ్డి, కమలాకర్ రెడ్డి, తదితర రైతు నాయకులు రైతులకు మద్దతు తెలియజేశారు.

# ఫైండ్ల రాజయ్య మృతి..

## - వారి కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు

**వేద న్యూస్, శాయంపేట:**




భూపాలపల్లి మాజీ శాసనసభ్యులు గండ్ర వెంకటరమణా రెడ్డి, వరంగల్ రూరల్ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ , బిఆర్ఎస్ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆదేశానుసారం శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామ బిఆర్ఎస్ నాయకులు కీ.శే. ఫైండ్ల రాజయ్య అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న శాయంపేట మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గంగుల మనోహర్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి రాజయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి భగవంతుడు మనో ధైర్యాన్ని ప్రసాదించాలన కోరుతూ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, వారి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట మారెపెల్లి మోహన్, దైనంపల్లి కరుణ్ బాబు, సవాసి రమేష్ , ఇమ్మడిశెట్టి సదానందం, ఫైండ్ల శంకర్, ఫైండ్ల శ్రీనివాస్,అమ్మ అశోక్, ఫైండ్ల భానుచందర్, కోగిల తిరుపతి,కోగిల రవికిరణ్, కోగిల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గం ఎన్నిక

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

నల్లగొండ జిల్లా 23వ మహాసభ దేవరకొండలో మందాడి నరసింహారెడ్డి ప్రాంగణంలో వందలాదిమంది ప్రతినిధులతో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యులుగా బంటు వెంకటేశ్వర్లు,సమితి సభ్యులుగా పోలేపల్లి ఉదయ్ కుమార్ ని ఏకాగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ మా మీద ఉంచిన బాధ్యతను సొంత ప్రయోజనాల కన్నా పార్టీ ప్రయోజనాలు ప్రధానంగా భావించి సక్రమంగా నెరవేస్తామని, పార్టీ ప్రతిష్టను పెంచే విధంగా జిల్లా వ్యాప్తంగా ఎర్రజెండా ప్రతిష్టతను పెంచేందుకు మా వంతుగా కృషి చేస్తామని అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరి స్తున్న ప్రజావ్యతిరేక విధానాలను సామ్రాజ్యవాద పెట్టుబడిదారుల పెంచి పోషిస్తున్న బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరంకుషత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లి ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

# ప్రతిరోజు సైకాలజీ తరగతులు నిర్వహించాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

ప్రభుత్వ వసతి గృహాలలో, గురుకులాలలో చదివే విద్యార్థిని,విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే సైకాలజీ తరగతులు ప్రతిరోజు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు.ఈ మధ్య తరచుగా గురుకులాలలో మరియు ప్రభుత్వ వసతి గృహాలలో చదివే విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల్లోనీ ఆందోళనను తగ్గించి,ఆత్మహత్యలను అరికట్టేందుకు వారికి అవగాహన కల్పించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ఆందోళన నుంచి బయటపడడం తదితర అంశాలపై అవగాహనతో పాటు గొప్ప గొప్ప వ్యక్తులు సాధించిన వారి యొక్క విజయాలను వివరిస్తూ మోటివేషన్ చేయాలని.విద్యార్థులు తొలిసారి గురుకులానికి రావడంతో వారు కొంత ఆందోళన చెందుతున్నారన్నారు.అలాంటి విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఎక్కువ సార్లు కలిసేందుకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ గౌడ్,ఓయు జెఏసి చైర్మన్ బండి నరేష్,మాల మహానాడు అధ్యక్షులు చంద్రమోహన్,బీసీ విద్యార్థి సంఘం నాయకులు గోదా రవీందర్ పాల్గొన్నారు.

# అస్సలు క్షమించవద్దు



అబ్దేల్‌ఫట్టా పేర్కొన్నారు. కాగా, నిమిష ప్రియకు బుధవారం ఉరిశిక్ష అమలు చేయాల్సి ఉంది. కానీ బహుముఖ చర్చల కారణంగా ఆమె ఉరిశిక్షను నిలిపివేశారు. సౌదీ అరేబియాలోని ఏజెన్సీలతో పాటు భారత ప్రభుత్వం పూర్తి మద్దతు, యెమెన్‌లోని షూరా కౌన్సిల్‌లోని ఒక స్నేహితుడిని మధ్యవర్తిత్వం కోసం సంప్రదించిన గ్రాండ్ ముఫ్తీ అబూబకర్ ముస్లియార్ మతపరమైన జోక్యం ఫలితంగా తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఉరిశిక్షను వాయిదా వేయాలనే నిర్ణయం తీసుకున్నారు. ఇదిలాఉంటే... నిమిష ప్రియను క్షమించగలిగేది మృతుడి కుటుంబమే. అయితే, ఆయన కుటుంబంలో అభిప్రాయ భేదాలు తలెత్తడంతో అధికారులతో పాటు, చర్చలలో పాల్గొన్న మతపరమైన వ్యక్తులు ఈ సమస్యను పరిష్కరించడానికి తమ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. అటు, కేరళ బిలియనీర్ ఎంఏ యూసుఫ్ అలీ కూడా ఈ విషయంలో అవసరమైన ఆర్థిక సహాయం అందించడానికి తన సంసిద్ధతను వ్యక్తం చేశారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించండి

**వేద న్యూస్, తంగళ్ళపల్లి :**



గత ఐదేండ్ల పదవి కాలంలో ప్రభుత్వం అందించిన సూచనలు, ఆదేశాల మేరకు గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మాజీ సర్పంచ్ నక్క కొమురయ్య తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, మన ఊరు–మన బడి, వైకుంఠదామం, రైతు వేదిక, మిషన్ భగీరథ, వీధిలైట్ల నిర్వహణ, పల్లెప్రకృతి వనం, వీధిలైట్ల నిర్వహణలాంటి అభివృద్ధి చేపట్టాని పేర్కొన్నారు.తెలంగాణ గ్రామాల్లో జరిగిన అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఉత్తమ గ్రామ పంచాయతీలుగా అవార్డులను అందించిన్నట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించకపోవడంతో తంగళ్ళపల్లి మండలం పాపాయి పల్లె గ్రామ మాజీ సర్పంచ్ నక్క కొమురయ్య అనేక ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలో ఉన్న బిల్లులు రాక ఒక పక్క ఆత్మహత్యకు పాల్పడలేక , మనోధైర్యంతో నా ఇల్లు అదే గ్రామానికి చెందిన గంభీరావుపేట పరశురాములకు 35 లక్షల అమ్మి అప్పులు కట్టానని అన్నారు. అప్పుల బాధతో కుటుంబంలో కలహాలు ఏర్పడుతున్నాయని అద్దె ఇంట్లో కాలం వెళ్ళదిస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు విడుదల చేసి తమ కుటుంబాలు ఆదుకోవాలని కోరుతున్నాను లేనియెడల ఆత్మహత్యలే శరణ్యం అని అంటున్నారు.

# వారానికి రెండు రోజులు ప్రజావాణి




**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఎస్పీ రాజశేఖర్ రాజు,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ లతో కలిసి మిర్యాలగూడ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రతి బుధవారం,శనివారం ప్రజా సమస్యల ఫిర్యాదుల కోసం ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు.ప్రజావాణిలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని అన్నారు.నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు 100 రోజుల ప్రత్యేక కార్యచరణ ఏర్పాటు చేసినట్టు తెలియజేశారు.

# అగ్రరాజ్యంలో కరోనా కలకలం

**వేద న్యూస్, డెస్క్ :**

యావత్ ప్రపంచాన్ని కరోనా మహమ్మారి ఎంతగా వణికించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. లక్షలాది మంది ఈ వైరస్ భూతం బారినపడి ప్రాణాలు కోల్పోయారు. సకాలంలో వ్యాక్సిన్లు రావడంతో ప్రపంచ దేశాలు ఊపిరి పీల్చుకున్నాయి. లేకుంటే మరింత జన నష్టం సంభవించేది. తాజాగా అమెరికాలో కరోనా వైరస్ మరోసారి కలకలం సృష్టిస్తోంది. గత కొన్ని రోజులుగా అగ్రరాజ్యంలో కరోనా బారిన పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం అమెరికాలో వేసవి కాలం కావడంతో, సెలవులను ఆస్వాదించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున ప్రయాణాలు చేస్తున్నారు. తీర ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలకు తరలిపోవడం వల్ల వైరస్ వేగంగా వ్యాపిస్తోందని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) వెల్లడించింది. ముఖ్యంగా ఫ్లోరిడా, టెక్సాస్, కాలిఫోర్నియా, ఒహియో వంటి రాష్ట్రాల్లో కేసుల సంఖ్య అధికంగా ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సీడీసీ నివేదిక ప్రకారం, ఎన్బీ.1.8.1 మరియు ఎక్స్ఎఫ్ జీ అనే కొత్త వేరియంట్లు ప్రస్తుతం అమెరికాలో వ్యాప్తిలో ఉన్నాయి. ఈ కొత్త వేరియంట్ల ప్రభావం వల్ల గొంతు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, గుండె బరువుగా ఉండటం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, గుండె బరువుగా ఉండటం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఏమైనా అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే కరోనా పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా వైరస్ వ్యాప్తిని నియంత్రించవచ్చని తెలిపారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, రద్దీ ప్రదేశాలకు వెళ్లినప్పుడు మాస్కులు ధరించాలని, సాధ్యమైనంత వరకు సామాజిక దూరాన్ని పాటించాలని అధికారులు కోరుతున్నారు.

# వైద్య విద్య కోసం మృతదేహం దానం

**వేద న్యూస్, హనుమకొండ :**




హనుమకొండ జిల్లా బాలసముద్రం నివాసి కొమ్మరాజు హేమలత (90) అనారోగ్యంతో మరణించారు. కుమారులు డాక్టర్ రవిశంకర్, ఉదయ శంకర్, గిరిజా శంకర్ సమాజ హితం కోరి, వైద్య విద్యా నిమిత్తం, వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ కి శరీర దానం చేయుటకు అంగీకరించారు. తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్ లో దేహాన్ని కేఎంసీ అనాటమీ విభాగానికి అప్పగించామని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్య, అనాటమ విభాగాధిపతి మొహిద్దీన్ ఖాన్ ఆదేశంతో సిబ్బంది ప్రేమ్ కుమార్, యాద గిరి, ప్రవీణ్ దేహాన్ని అనాటమీ విభాగానికి తరలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యా మాట్లాడుతూ అందరం శరీర దానంపై అవగాహన కలిగియుండి, మరణానంతరం శరీర దానంచేస్తే, బావి వైద్యులకు వైద్య విద్య అధ్యయనం కోసం, శాస్త్ర పరిశోధన కోసం, సర్జరీని నేర్చుకోవడానికి ఉపయోగపడుతుంది అని కోరారు. శరీర దానం చేసిన కుటుంబ సభ్యులకు ధన్యవాదములు తెలిపి, శరీర దాన సర్టిఫికెట్ కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి మాట్లాడుతూ మరణానంతరం నేత్రదానం చేస్తే ఇద్దరు అందులకు చూపునిస్తాం, శరీర దానం చేస్తే వందల మందికి వైద్య పాఠం ఐదాం, అవయవ దానం చేసి ప్రాణదానం చేద్దాం అని ఏవైనా వివరాలకు 8790548706, 9490133650 గల ఫోన్ నెంబర్లను సంప్రదించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు శ్రీనివాస్ చక్రవర్తుల, అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు మునిగాల పద్మ, సెక్రటరీ అనంతుల కేదారి, ట్రెజరరీ నరసింహ రాములు, రాజు భూపాల్ పల్లి పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**వేద న్యూస్,శాయంపేట:**




హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలో గత సంవత్సరము మండల స్థాయి లో పదవ తరగతిలో మార్కులు సాధించిన పదిహేను మంది విద్యార్థులను కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్( రిటైర్డ్ టీచర్ ) ప్రతిభా పురస్కారాలను ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శేఖర్ అధ్యక్షత మండల విద్యాధికారి బిక్షపతి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి గత సంవత్సరం పదో తరగతిలో మంచి మార్పులు సాధించిన టాపర్స్ ను ఉద్దేశించి మాట్లాడుతూ పదవ తరగతి మంచి మార్కులు సాధించడం మొదటి స్టెప్ మాత్రమే అని, ఇదే విధంగా భవిష్యత్తులో మంచి మార్పులు సాధించాలని అన్నారు. విద్యార్థులు ఉత్తమ లక్ష్యాన్ని నిర్ణయించుకొని లక్ష సాధన కొరకు క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలని వారు సూచించారు. మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు అవార్డ్స్ అందించడం అభినందనీయం అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుండి వచ్చినటువంటి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు ,రిటైర్డ్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సురేష్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లండన్ లో వైభవంగా బోనాల జాతర వేడుకలు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



ఈస్ట్ లండన్‌లో సంస్కృతి, భక్తి, సమాజ ఉత్సవానికి మార్గదర్శిగా పోచమ్మ బోనాలు 2025 ఈస్టామ్ మహాలక్ష్మి ఆలయంలో సంప్రదాయబద్ధమైన బోనాల పూజతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ పవిత్ర పూజను శ్రీధర్ నీలా (అధ్యక్షులు డబ్ల్యూ ఎన్ ఎఫ్), రజిత గుండు కుటుంబం ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. తెలంగాణలో జరుగుతున్న విధానాన్నే అనుసరిస్తూ, బోనం మోసి, దీపారాధన నిర్వహించి, అమ్మవారిని ప్రార్థించడంలో పాల్గొన్నారు. పూజ అనంతరం, భక్తులు న్యూహామ్ టౌన్ హాల్కి తరలించి, ప్రధాన ఈవెంట్ నిర్వహించారు. హాల్ మొత్తం పూజా అలంకరణలతో శోభాయమానంగా మారి, తెలంగాణ భక్తి సంప్రదాయాన్ని ప్రతిబింబించింది. ఈ వేడుకలో ప్రధాన ఆకర్షణగా అమ్మవారి విగ్రహం నిలిచింది. చూసిన ప్రతి ఒక్కరికి భక్తిస్ఫూర్తి కలుగుతూ, అమ్మ దుర్గమ్మకు మనస్ఫూర్తిగా కోరికలు చెల్లించేందుకు ప్రేరణ కలిగింది. ఈ వేడుకకు యుకే నలుమూలలా నుండి సుమారు 2500 కి పైగా ప్రవాస కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ వేడుకల శుభారంభం, తేజస్ అయ్యగారు నేతృత్వంలో సంప్రదాయబద్ధంగా బోనాల పూజతో జరిగింది. వందలాది మంది భక్తులు పూజలో పాల్గొని, అమ్మవారిని ప్రార్థించి, ప్రసాదాన్ని స్వీకరించారు. న్యూహామ్ టౌన్ హాల్ ఒక ఉత్సాహభరితమైన సాంస్కృతిక వేదికగా మారింది. భక్తి సంగీతం, డప్పుల శబ్దాలు, స్టేజిపై ప్రదర్శనలు ఇవ్వడానికి సిద్ధమవుతున్న చిన్నారుల కిలకిలలతో అంతటా ఆనందవాతావరణం నెలకొంది. ప్రత్యేక అలంకరణలు, స్పాన్సర్ స్టాళ్లు, భోజన ఏర్పాట్లు, సముదాయంలో ఉన్న ఉత్సాహంతో హాల్ మొత్తం ఉత్సవ కళను ఆవిష్కరించింది. ఈ వేడుకను అనేక ప్రముఖ అతిథులు ఘనతతో గౌరవించారు. రైట్ హానరబుల్ స్టీఫెన్ టిమ్స్, ఎంపీ బ్రిటన్ ప్రభుత్వ సామాజిక భద్రత, దివ్యాంగుల మంత్రిత్వ శాఖ మంత్రి యున్మేశ్ దేశాయ్, లండన్ అసెంబ్లీ సభ్యులు (ఈస్ట్ లండన్) పోలీస్, క్రైమ్ మంత్రిత్వ శాఖ కౌన్సిలర్ ఉదయ్ ఆరేటి, కెన్సింగ్టన్, చెల్సియా రాయల్ బరో డిప్యూటీ మేయర్ ఈ హోదాలో బాధ్యత వహించిన మొట్టమొదటి తెలుగు వ్యక్తి స్టీఫెన్ టిమ్స్ డబ్ల్యూ ఎన్ ఎఫ్ సముదాయ నిర్మాణంలో చూపిన విశేష కృషికి అభినందనలు తెలిపారు. స్థాపకుడు కిరణ్ పసునూరి, అధ్యక్షుడు శ్రీధర్ నీలా నాయకత్వాన్ని ప్రశంసిస్తూ డబ్ల్యూ ఎన్ఎఫ్ ఏర్పాటైనప్పటి నుండి నేను దీనిని క్రమంగా చూస్తున్నాను. ఇది నిస్సందేహంగా యూకే లో వారసత్వాన్ని కాపాడుతూ, బ్రిడ్జ్‌లను నిర్మించే ఒక భక్తి పూరిత ఉత్సవం అని అన్నారు. యున్మేశ్ దేశాయ్ టెక్నాలజీ, వైద్య, వ్యాపార రంగాల్లో యూకే కి తెలుగు ప్రజల చేసిన కృషిని వివరించారు. బ్రిటన్ అభివృద్ధిలో భారతీయ వంశావళి వృత్తిపరుల పాత్రను గుర్తించారు. ఉదయ్ ఆరేటి గత ఎనిమిదేళ్లుగా డబ్ల్యూ ఎన్ ఎఫ్ నిర్వహించిన సేవా కార్యక్రమాలను, ముఖ్యంగా అంధ పాఠశాల దత్తతను ప్రశంసించారు. తన ప్రజా జీవితంలో డబ్ల్యూ ఎన్ ఎఫ్ కి ఎల్లప్పుడూ మద్దతుగా ఉండేందుకు హామీ ఇచ్చారు.

# 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'కు ఆమోదం

**వేద న్యూస్, డెస్క్:**

కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన' పథకానికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు అభివృద్ధి లక్ష్యంగా దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. 2025-26 నుంచి ఆరేళ్ల కాలానికి ఈ పథకం 100 జిల్లాలను కవర్ చేసేలా ప్రణాళిక రూపొందించారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచడం, పంటల్లో వైవిధ్యీకరణ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పంట కోత తర్వాత గ్రామస్థాయిల్లో దిగుబడులను నిల్వ చేయడానికి గోదాముల సదుపాయం, నీటి పారుదల సౌకర్యాలను మెరుగుపరచడం, రుణ లభ్యతను సులభతరం చేయడం వంటి లక్ష్యాలతో పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని రూపొందించారు. 11 శాఖల్లోని 36 పథకాలు, రాష్ట్రంలోని ఇతర పథకాలు, ప్రైవేటు రంగంతో స్థానిక భాగస్వామ్యం ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తారు. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మరికొన్ని నిర్ణయాలు కూడా తీసుకున్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ఎన్టీపీసీకి రూ. 20 వేల కోట్ల పెట్టుబడులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అంతరిక్ష కేంద్రంలో 18 రోజులు గడిపి విజయవంతంగా భూమికి తిరిగి వచ్చిన శుభాంశు శుక్లాను అభినందిస్తూ తీర్మానం చేశారు.




# ఆందోళన కలిగిస్తున్న నిఫా వైరస్

**వేద న్యూస్, డెస్క్:**

కేరళలో ప్రమాదకర నిఫా వైరస్ మరోసారి ఆందోళన కలిగిస్తున్నది. ఈ వ్యాధి సోకి ఒక టీనేజర్ గత నెల 1న కోజీకోడ్‌లోని ఒక ప్రైవేట్ దవాఖానలో మరణించిన విషయం తెలిసిందే. తాజాగా నిఫా కారణంగా మరో మరణం నమోదైంది. పాలక్కాడ్‌లోని మన్నర్కాడ్ ప్రాంతానికి చెందిన 50 ఏళ్ల వ్యక్తి తీవ్రమైన శ్వాసకోశ ఇబ్బందితో మరణించాడు. అతడికి నిర్వహించిన ప్రాథమిక పరీక్షల్లో నిఫా నిర్ధారణ అయ్యింది. దీంతో కేరళ ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఆరు జిల్లాల్లో అలర్ట్ ప్రకటించింది. పాలక్కాడ్, మలప్పురం, కోజీకోడ్, త్రిస్సూర్, కన్నూర్, వయనాడ్ జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. నిఫా, నియంత్రణ చర్యలు, కాంటాక్ట్ ట్రేసింగ్‌ను ముమ్మరం చేశారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా 675 మంది నిఫా కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్నట్లు కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ తెలిపారు. మలప్పురం జిల్లాలో 210, పాలక్కాడ్‌లో 347, కోజీకోడ్‌లో 115, ఎర్నాకులంలో ఇద్దరు, త్రిస్సూర్‌లో ఒకరు ఉన్నారు. మలప్పురంలో ఓ వ్యక్తి నిఫా కారణంగా ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ జిల్లాలో 82 నమూనాలను పరీక్షించగా నెగెటివ్ వచ్చినట్లు ఆరోగ్య శాఖ తెలిపింది. ఇక పాలక్కాడ్‌లో 12 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 38 మంది రిస్క్ కేటగిరీలో, 139 మంది హైరిస్క్ కేటగిరీలో ఉన్నారని వివరించారు.

**- ఎలా వ్యాపిస్తుంది..**

దక్షిణ భారతదేశంలో తొలిసారి నిఫా వైరస్ కేసు మే 19, 2018లో కోజికోడ్ జిల్లాలోనే బయటపడింది. ఈ వైరస్ కారణంగా 2018, 2021లో మరణాలు నమోదయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. జంతువుల నుండి ప్రజలకు ఈ వైరస్ వ్యాపిస్తుంది. కలుషితమైన ఆహారం, ఈ వ్యాధి బారినపడిన వారి నుంచి ఇది నేరుగా మరో వ్యక్తికి సంక్రమిస్తుంది. ముఖ్యంగా తుంపర్లు, ముక్కు నుంచి, నోటి నుంచి వచ్చే ద్రవాల ద్వారా సోకుతుంది. ఈ వైరస్ లక్షణాలు తొందరగా బయటపడవు. ఈ వైరస్ కొందరిలో మెదడువాపుకు కారణమవుతుంది. ఒకసారి ఈ వైరస్ ఒంట్లోకి ప్రవేశించాక సాధారణంగా సగటున తొమ్మిది రోజుల్లో లేదా 4 నుంచి 15 రోజుల్లో లక్షణాలు కనిపిస్తాయి.

**- లక్షణాలు, చికిత్స**

వైరస్ సోకిన వారికి జ్వరం, తలనొప్పి, దగ్గు, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండటం, అలసట లాంటి లక్షణాలు ఉంటాయి. వైరస్ సోకిన వారిలో దాదాపు 75% మంది మరణించే అవకాశముంది. దీనికి ప్రత్యేకమైన చికిత్సగానీ, ఔషధాలుగానీ లేవు. కాబట్టి మాస్కులు ధరించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం.

# బస్సులో డెలివరీ బిడ్డను కిటికీలో నుంచి విసిరేసిన యువతి



**వేద న్యూస్, డెస్క్:**

మహారాష్ట్రలో అత్యంత అమానవీయ ఘటన చోటుచేసుకుంది. బస్సు ప్రయాణంలో ఓ బిడ్డకు జన్మనిచ్చిన యువతి.. ఆ పసికందును కిటికీలో నుంచి బయటకు విసిరేసింది. దీంతో గాయాలపాలైన ఆ పసికందు అక్కడికక్కడే చనిపోయింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. పోలీసులు బస్సును ఆపి తనిఖీ చేశారు. పందొమ్మిదేళ్ల యువతిని, ఆమెతో పాటు ఉన్న యువకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పర్భణికి చెందిన రితిక ధీరే, అల్తాఫ్ షేక్ లు కొంతకాలంగా పూణేలో జీవిస్తున్నారు. ఈ క్రమంలో రితిక గర్భం దాల్చింది. తాజాగా సోమవారం రాత్రి నిండు గర్భిణి రితికతో అల్తాఫ్ పర్భణి బయలుదేరాడు. స్లీపర్ కోచ్ లో రాత్రంతా ప్రయాణించారు. తెల్లవారుజామున రితికకు పురుటి నొప్పులు ప్రారంభమయ్యాయి. పత్రి- సేలు రోడ్డులో ప్రయాణిస్తుండగా బస్సులోనే బిడ్డకు జన్మనిచ్చింది. పుట్టిన బిడ్డను అల్తాఫ్ ఓ గుడ్డలో చుట్టి కిటికీలో నుంచి బయటకు విసిరేశాడు. బస్సులో నుంచి ఏదో వస్తువు పడడం చూసిన స్థానికుడు దగ్గరికి వెళ్లి పరిశీలించాడు. అందులో పసిబిడ్డను చూసి వెంటనే పోలీసులకు ఫోన్ చేశాడు. విషయం తెలిసిన వెంటనే స్పందించిన పోలీసులు ఆ బస్సును ఆపి రితిక, అల్తాఫ్ లను అదుపులోకి తీసుకున్నారు. చికిత్స కోసం రితికను ఆసుపత్రిలో చేర్పించి అల్తాఫ్ ను విచారించారు. తాము భార్యాభర్తలమని, బిడ్డను పెంచే స్తోమత లేకపోవడం వల్లే ఈ పని చేశామని అల్తాఫ్ చెప్పుకొచ్చాడు. అయితే, వారిద్దరూ భార్యాభర్తలు అనేందుకు ఎలాంటి ఆధారం చూపలేకపోయాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073